# హిట్ మి టునైట్



తాళ్ళూరు నాగేశ్వరరావు

వేల సంఖ్యలో వున్న దురదృష్ట వంతుల సొమ్మును వేళ్ల సంఖ్యలో వున్న అదృష్టవంతులు పంచుకునే స్థలాన్ని సింపుల్‌గా "రేస్‌కోర్స్" అంటారనుకొంటే, ఆ రోజు సాయం కాలం అయిదు నిముషాలకు అయిదు గంటలవుతుందనగా మలక్‌పేట రేస్‌కోర్స్ బుక్కీ-సర్కిల్‌లో సర్కస్‌లో వింత జంతువును చూస్తోన్న పోజులో రింగ్ బోర్డులమీద రేసులో పరుగెత్త బోయే గుర్రాల అడ్స్ చూస్తో నిల బడ్డాడు. ఇరవై నాలుగేళ్లకు పది నెలలు తక్కువైన వయస్సుగల శ్రీధర్ మూర్తి. చేతిలో ఫోర్ స్క్వేర్ సిగరెట్టు పొగలు విడుస్తుండగా.

అప్పటికే అయిదు రేసులు అయి పోయాయి.

మొదటి రేసులో హాట్ ఫేవరేట్ మీద పందరూపాయలు కాస్తే, ఫొటో ఫినిష్‌లో షార్ట్ హెడ్‌తో 'షోమైలే' అనే గుర్రం సెకండయింది.

రెండో రేసులో కాలుక్యులేషన్‌లో ఫస్టుగా వచ్చి, సెకండ్ ఫేవరేట్ లవ్‌లీ లేడీమీద రెండొందలు టం టం ఒక రేటులో కాస్తే, ఫైనల్ బెండ్‌దాకా ఫోర్ లెంగ్త్స్ లీడింగ్‌తో వచ్చి, విన్నింగ్‌పోస్టు దగ్గర అడ్రసు లేకుండా పోయింది.

మూడో రేసు బి. క్లాసుది. అన్నీ కంచర గాడిదలే. అ. దుపేత అందులో ఆరుగుర్రాలు. దేని మీదా పైసాకాయ లేదు. అయితే జాక్‌పాట్ ఫస్టులెగ్ కావడంవల్ల, ఆరింటిలో పదిహేనేళ్ల

ముసలి వయస్సుగల 'మేరే మొహబత్' అనే గుర్రాన్ని మినహాయించి, ఫస్ట్ లెగ్‌లో అయిదింటినీ, సెకండ్ లెగ్‌లో మూడింటినీ, థర్డ్ లెగ్‌లో బ్యాంకర్నే, ఫోర్త్ లెగ్‌లో రెండింటినీ, ఫిఫ్త్ లెగ్‌లో మరో రెండింటినీ వేసి మూడొందల రూపాయలతో జాక్‌పాట్ కాంబినేషన్ తీస్తే, దురదృష్టం తన కసినంతా తీర్చుకున్నట్టు, 'మేరే మొహబత్' అనే ముసలిగుర్రం స్టార్ట్‌టుఫినిష్ గెల్చి, జాక్‌పాట్ కాంబినేషన్ పత్రాన్ని పది ముక్కలుగా చింపించి, రేసుమీద రాజ్యాన్ని పోగొట్టుకున్నంత విరక్తిని కలిగించింది శ్రీధరమూర్తికి.

నాలుగో రేసు క్లాస్ ఒన్‌ది. హిందూ, ఎక్స్‌ప్రెస్, క్రానికల్, ఈనాడు, ఆంధ్రప్రభ, రేసుబులిటిన్, ఒరిజినల్ వేల్, సౌత్ ఇండియా, కె. యస్. మొదలైనవన్నీ 'రాయల్ శాల్యూట్'ను దేస్ బెస్ట్‌గా ఇచ్చాయి. రెండు రెళ్ల నాలుగన్నంత నమ్మకంతో ఆ గుర్రం మీద హాఫ్‌మనీలో రెండొంథలు కాశాడు శ్రీధరమూర్తి. పదహారొందల మీటర్ల ఆ రేసులో ఆ గుర్రం వెయ్యిమీటర్ల దాకా ఫార్వర్డ్ రన్ యిచ్చి, ఆ తర్వాత కామెంట్‌లో లేకుండాపోయింది. బోర్డు ఎక్కలేదు. దానిమీద డబ్బు కాచిన వాళ్లంతా బిక్కమొహాలు వేశారు. తీరా విచారిస్తే దాని బ్లేడ్‌వేన్స్ తెగి ముక్కువెంట రక్తం పడిందట!

అయిదో రేసు వచ్చేసరికి శ్రీధరమూర్తికి తన రేసు విజ్ఞానం, అనుభవం, ఆలోచన, కాలెక్యులేషన్లు, స్పెక్యులేషన్లు, పెడిగ్రీ స్టడీ, హాండీకాప్ అధ్యయనం మొదలైన వాటిపై అపనమ్మకం కలిగాయి. ఒక మనిషి మరో మనిషిని నమ్మలేని ఈరోజుల్లో నోరులేని జీవులపై విశ్వాసాన్ని కుదుర్చుకొని వేలకువేలు డబ్బు వెచ్చించడం అవివేకం కాదూ అనుకున్నాడు! అయినా వ్యసనం ముందు వేదాంతం ఏపాటి? అది 'ఏ' క్లాసు రేసు. అందులో పన్నెండు గుర్రాలున్నాయి. ఆరు గుర్రాల్ని ఏరి వేసినా మిగతా ఆరింట్లో ఏదైనారావచ్చు. అందుచేత ఆ రేసులో బెటింగ్ ఆడకుండా, ఫోర్‌కాస్ట్‌లు, క్వినిల్లాలు జోరుగా తీశాడు—ఓ నూట ఇరవై రూపాయలకు. రెండు లాంగ్‌షాట్‌లు వస్తూ, సెకండూ పస్తే, ఫోర్‌కాస్ట్ మొత్తం వేలల్లోనూ, క్వినిల్లామొత్తం వందల్లోనూ ఉంటుందని ఆశపడగా, జాయింట్ ఫేవరేట్లు వచ్చి, పన్నెండు రూపాయల ఫోర్‌కాస్ట్‌మొత్తం, పదిరూపాల క్వినిల్లా వచ్చాయి. అయితే శ్రీధరమూర్తికి ఆ చిన్న మొత్తాలు కూడా దక్కలేదు. అతను వేసిన గాలం మరి పెద్దచేపకేగా!

తనాలా, ట్రిబుల్ ఈ రెంట్లజోలికి శ్రీధరమూర్తి వెళ్లడు. వాటిపై మోజు లేదు.

ఆరో రేసుకు జేబులు తడిమిచూసుకున్నాడు శ్రీధరమూర్తి, జేబుల్లోమొత్తం నూట ఇరవై రూపాయలున్నాయి. వంద రూపాయలు ఓ గుర్రంమీద కాస్తే, పద్దెనిమిది రూపాయలు బెటింగ్ టాక్స్‌కింద పోతే, చివరకు జేబులో రెండ్రూపాయలు మిగులుతాయి అనుకున్నాడు. అయినా జంకలేదు. జూదగాని మనస్సు ఎంత కొండనైనా 'ఢీ' కొనే ధీమాగలది. అది క్లాప్'బి'రేసు. తొమ్మిదిగుర్రాలున్నాయి. దూరం వెయ్యిమీటర్లు మాత్రమే. బోర్డు మీద ఆడ్స్ రకరకాలుగా వున్నాయి. 'రెడ్‌హాట్' ఆడ్స్ ఆన్ ఫేవరేట్. దాని మీద ఫారిన్ జాకీ. దాని వయస్సు మూడేళ్లమాత్రమే. వెయిట్ 55 కిలోలు అన్నింటికంటె తక్కువ ఫేవరేట్ 'మీట్ మి టునైట్' ట్వెంటీ టు ఒన్. దాని వయస్సు ఆరేళ్లు. అయితే గత మూడేళ్ల జీవితంలో ఎప్పుడూ గెలవలేదు. క్లాస్ ఫోర్‌నుంచి 'బి'కి బాటమ్ వెయిట్‌కి దిగివచ్చింది. ఒకసారి మాత్రం ఊటీలో డిస్టెన్స్‌లో ఫోర్త్‌గా బోర్డెక్కింది. వెయిట్ 45 కిలోలు. దాని మీద అయిదు కేజీల అలవెన్స్‌గల అప్రెంటిస్ జాకీ కూర్చున్నాడు. ఆ జాకీకి ఇంతవరకూ ఒక్క విన్ కూడా లేదు. కాకపోతే రెండుసార్లు సెకండూ, మూడుసార్లు థర్డ్ వచ్చాడు. ఆ గుర్రం డ్రా నెంబరు ఒకటి. స్టార్ట్ తీసుకుంటే రెయిల్స్ పక్కనే పారిపోవచ్చు. ఒకప్పుడు స్ప్రింటర్‌గా పేరుండేది. ఆరోజు తన అదృష్టానికి ఆ గుర్రాన్నే గీటురాయిగా ఎంచుకున్నాడు. 'మీట్ మి టునైట్' మీద వందరూపాయలు కాశాడు శ్రీధరమూర్తి. తీరా గుర్రాలు పేడక్ వొదిలి, స్టార్టింగ్‌గేటు దగ్గరకు వెళ్లేసరికి ఆ గుర్రంమీద ఆడ్స్ ముప్పైదాకా పోయాయి. శ్రీధరమూర్తి మనస్సు ముల్లు గుచ్చుకున్నట్టు చివుక్కుమంది. 'పోనీలే! అది గెలవాలి గానీ, గెలిస్తే రెండువేలు వస్తాయి' అని అంతలోనే సరిపెట్టుకున్నాడు.

డబ్బులు పోగొట్టుకున్నవాని మొహంలా సూర్యాస్తమయం వుంది.

రేస్ స్టార్ట్‌కావడానికి ముందు సిగ్నల్ మోగింది. ఒక్కొక్క గుర్రం స్టాల్స్‌లోకి వెళుతున్నాయి.

కాళ్ళీడ్చుకుంటూ గ్రాస్ ట్రాక్ దాకా వెళ్లలేక కలర్ టి. వి. ముందు నిలబడ్డాడు శ్రీధరమూర్తి.

కొన్ని గుర్రాలు వెనుకనుంచి, కొన్ని గుర్రాలు ముందునుంచీ స్టార్టింగ్ గేటులోకి జొరబడ్డాయి. కొన్నిగుర్రాలకు బ్లింకర్సునాయి.

తెల్లజెండా కదిలింది.

గుర్రాలు గేటులోంచి తలుపులు తెర్చుకుని బయటి కొచ్చాయి.

'రెడ్‌హీట్' మాత్రం కొన్ని సెకండ్ల పాటు 'ప్లాంట్' అయి, తర్వాత పరుగు అందుకొంది. అయినా టెన్‌లెంగ్త్స్‌తో

రీర్ పొజిషన్‌లో వుంది. ఫేవరెట్ హార్స్ అలా 'ప్లాంట్' కావడం తన అదృష్టానికి చిహ్నం అనుకున్నాడు శ్రీధరమూర్తి.

'మీట్ మి టునైట్' స్టార్ట్ జంప్ తీసుకుంది. ఆ జంప్‌తో త్రీ లెంగ్త్స్‌తో ముందుకొచ్చింది ఎనిమిది వందల మీటర్ల దగ్గర ఫోర్ లెంగ్త్స్‌తో స్పీడ్‌లో వుంది. రన్నింగ్‌ను కలర్ టి. వి. లో చూస్తూనే వున్నాడు శ్రీధరమూర్తి. క్షణక్షణానికీ అతని గుండె వేగం వేడెక్కిపోతుంది.

ఫైనల్ బెండ్ దగ్గర కొన్ని గుర్రాలుపైడ్ అయిపోయాయి. ఫేవరెట్ వెనకబడే వుంది. 'మీట్ మి టు నైట్' మాత్రం రెయిల్స్ పక్కనే వెనక చూపులేకుండా 'లైఫ్ అండ్ డెత్' అన్నట్టుగా పరిగెడుతోంది.

.... 400 మీటర్లు .... మీట్ మి టు నైట్ ....3¼ లెంగ్త్స్ లీడింగ్.

........ 200 మీటర్లు .... మీట్ మి టునైట్ 3 లెంగ్త్స్ లీడింగ్.

........100 మీటర్లు .... మీట్ మి టు నైట్- 1¼ లెంగ్త్స్ లీడింగ్.

హఠాత్తుగా 'రాయల్ రన్నింగ్' అవుట్‌సైడ్ నుంచి 'టేక్ ఓవర్' చేయడానికి ట్రైచేసింది. కాని చివరి 50 మీటర్లలో 'షిప్టు' అయింది. అయినప్పటికీ ఫోటోఫినిష్ కొచ్చింది.

మొదటి రెండు ప్లేసులకూ జడ్జి 'ఫోటో'ను కన్సల్ట్‌చేయాలన్నాడు. అందులో 'మిట్-మి-టు నైట్' 'రాయల్ రన్నింగ్' ఉన్నాయి.

రిజల్టు తెలిసేవరకూ శ్రీధరమూర్తి గుండె ఆదుర్దాతో అటూ ఇటూ ఊగిసలాడింది.

ఫోటో ఫినిషెలో 'మిట్-మి-టు నైట్' నెక్‌తో గెల్చింది.

మబ్బులో మెరుపు మెరిసినట్టు శ్రీధరమూర్తి ఎగిరి గంతేశాడు సంతోషంతో.

రెండువేలు గెల్చాడు.

నష్టాలు పోగా చివరికి అతనికి ఆరొందలుదాకా లాభం మిగిలింది. సంతోషసాగరమైన మనస్సుతో సాయంత్రం అయిదూ ముప్పావుకు రూమ్‌కొచ్చాడు శ్రీధరమూర్తి.

* * *

రూమ్ తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించగానే ఓ తెల్లని చీటీ నేలమీద కనిపించింది. సూర్యాస్తమయపు ఎర్రని వెలుగు కిటికీలోంచి పడుతూ గదిలో చీకటని చొరనివ్వడం లేదు.

శ్రీధరమూర్తి కిందకు వంగి ఆ చీటీ తీసుకుని చదివాడు ఆత్రంగా.

"మీట్-మి-టునైట్, —రాధిక"

శ్రీధరమూర్తి మనస్సు సాగదీసిన మల్లెమొగ్గయింది.

ఎందుకో!

ఎప్పుడో, ఎక్కడో కల్సుకోవడం అతనికి తెలుసు.

వెంటనే అటాచ్‌డ్ బాత్‌రూంకెళ్ళి స్నానం చేశాడు శ్రీధరమూర్తి. టోబాకో కలర్ గాబర్డీన్ ప్యాంటుమీద వైట్ బ్యాక్‌గ్రౌండ్ జీబ్రా చారల 'టీ' షర్టు ధరించాడు. 'సెల్లిన్' కోలన్ స్ప్రే చేసుకున్నాడు. సున్నితమైన సువాసన గుప్ మంది. వొత్తుగా, నల్లగా, నిగనిగలాడే జుత్తుకు బిల్‌క్రీం పట్టించి, నున్నగా దువ్వుకున్నాడు. ఓల్డుస్పైస్ మెన్స్ టాల్కం చల్లుకొని, అద్దంలో ఫైనల్‌గా చూసుకొని, తన అందాన్ని అద్దం ఏ మాత్రం మోసంచేయలేదని సంతృప్తిపడ్డాడు.

సూర్యుడు నెమ్మదిగా నిష్క్రమించగా, మునిమాపు మనోజ్ఞంగా మేలిముసుగు కప్పకుంది.

వీధిలోకొచ్చి ఎదురైన ఆటోను ఆపి, ఆటోమేటిక్‌గా ఎక్కి, ఇందిరా పార్కుకు పోనివ్వమన్నాడు శ్రీధరమూర్తి.

స్నానం చేస్తున్నా, డ్రస్సు వేసుకుంటున్నా, తల దువ్వుకుంటున్నా, షూ వేసుకుంటున్నా — అతని మనస్సులో రాధిక పుట్టించిన వాతావరణంలో సీతాకోకచిలుక తిరిగినట్టుగా తిరుగుతూనే వుంది.

అంత హఠాత్తుగా ఎందుకు రమ్మంది రాధిక? ఏం ప్రమాదం ఏర్పడింది? కొంపదీసి వాళ్ళవాళ్ళు సడెన్‌గా ఏదైనా సంబంధాన్ని కుదర్చలేదుగా! అదే జరిగితే తనేం చెయ్యాలి?— ఆలోచిస్తూ ఆటో దిగాడు శ్రీధరమూర్తి.

లేక్ పక్కనే గులాబీల గార్డెన్ చెంతన మెర్క్యురీ లైట్ కాంతిలో తెల్లగులాబీలా వెలవెలబోతూ నిలబడి వుంది రాధిక అతనికోసం, ఉత్కంఠగా ఎదురుచూస్తూ.

అంతదూరం నుంచి ఆమె వాలకాన్ని చూసి ఆందోళనపడ్డాడు శ్రీధరమూర్తి. దగ్గరకు రాగానే "ఏమైంది?" అన్నాడు నేరుగా విషయంలోకి దిగుతూ.

"ఏం కాకూడదో అదే అయింది" అంది రాధిక చెరుకాకులాంటి చిరాకుతో.

"అంటే!"

"మావాళ్ళు ఒక సంబంధం ఖాయం చేశారు."

"ఎవరితో! డాక్టరుతోనా?"

"డాక్టరైతేం, యాక్టరైతేం! మీతో కానప్పుడు."

"ఒప్పుస్తానంటివిగా!"

"అన్నాను. చివరిదాకా ప్రయత్నించాను. కాలేదు. ఏడ్చినా వాళ్ల గుండె కరగలేదు. బెదిరించినా భయపడలేదు. ఇంకా ఏంచేసేది?"

"ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాను. ఆస్తి వుంది. అందముంది. పైగా ఇద్దరమూ ప్రేమించుకున్నాం. కులంలో కూడా తేడాలేదు."

"అన్నీ ఒక ఎత్తు. మీ ప్రవర్తన మరో ఎత్తు. మీ క్వాలిఫికేషన్లను మీ



ప్రవర్తన డిస్క్వాలిఫై చేసింది."

"అంతే"

"మీరు క్లబ్బులో పేకాడతారు!"

"ఊఁ!"

"మీరు బార్స్‌కు వెళతారు!"

"ఊఁ!"

"మీరు రేసుల కెళతారు!"

"ఊఁ!"

"మీ వయస్సు ఇంకా పూర్తిగా ఇరవై నాలుగు నిండలేదు!"

"ఊఁ!"

"ఈ వయస్సుకే ఇన్ని వ్యసనాలుంటే – మీకు కాబోయే భార్య బ్రతుకు బూడిదకాదనే గ్యారంటీ ఏముంది?"

"నువ్వు నన్ను అర్థంచేసుకోలేవా?"

"నేను అర్థంచేసుకొంటే ఏం లాభం? మా నాన్న అర్థంచేసుకోవాలి. మా నాన్న మీ గురించి పూర్తిగా ఎంక్వాయిరీ చేశాడు. 'ఆ వ్యసనాల పుట్టకు నా కూతుర్ని యిచ్చేకంటె వినాయక్‌సాగర్‌లోకి నెట్టి నెత్తిన నీళ్లుపోసుకోవడం పుణ్యం!' అన్నాడు. మన పెళ్లి అయ్యే వరకైనా మీరు వ్యసనాల జోలికి పోకుండా బుద్ధిగావుంటే బావుండేది!"

"మరి ఇప్పుడేం చేద్దాం" అన్నాడు శ్రీధరమూర్తి కసాయివాడు దుకాణంలో వేలాడగట్టిన మాంసపు ముక్కలా మొహంకాగా.

"చేసేదేముంది? నది ఒడ్డున అవతల మీరు, ఇవతల నేను. మధ్యలో నీటి ప్రవాహంలాగ కాలం కదిలిపోతుంది. నేను మావాళ్లు నిర్ణయించిన పెళ్లి చేసుకోకతప్పదు. మీరు మీవాళ్లు కుదిర్చిన పెళ్లిచేసుకోండి. ఈ జన్మకు మనమిద్దరం ఉత్తర, దక్షిణ ధృవాలం" అని విసవిసా పార్కునుంచి నడిచిపోయింది రాధిక, విధిమీద కసి తీర్చుకున్నంత కోపంతో.

శ్రీధరమూర్తి శిలావిగ్రహంలా నిలబడిపోయాడు— మనస్సు అమావాస్య నాటి మబ్బుపట్టిన అర్ధరాత్రి కాగా.

అలాంటి అతని మనస్సులో —

'మీట్ మి టునైట్' గుర్రమూ;

బ్లూజెమ్ బార్‌లో 'బ్లాక్‌నైట్' విస్కీబాటిలూ; బోటుక్లబ్‌లో.

అర్ధా-రూపాయి' రమ్మీ ఆటా - వ్యసనాల విషవలయంలో మిణుగురు పురుగుల్లా మెదిలాయి.

———